విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 23, డిసెంబర్ 2024

ప్రజారోగ్యం నేల పాలు..

విశాలాంధ్ర - చాగలమర్రి : పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వైద్యశాలలో అన్ని రకాల మందులను ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అయితే క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో పేదలకు అందాల్సిన మందులు నేల పాలవుతున్నాయి. చాగలమర్రి పట్టణం లోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు వెళ్లే మార్గంలో చెత్త కుప్పల పక్కన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండాల్సిన మందులు ఆదివారం దర్శనమిచ్చాయి. గడువు పూర్తి అయ్యాయా అని పరిశీలించగా టానిక్‌లు, తదితర మందులపై గడువు ఇంకనూ ఉంది. ఇది ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యమా, సిబ్బంది నిర్లక్ష్యమో తెలియాల్సి ఉంది.

నాపరాయి ఫీజుపై తెగని పంచాయతీ

4 రోజులుగా కార్మికుల నిరసన దీక్ష
పట్టించుకోని ప్రతిపక్షం
న్యాయం చేయాలంటున్న అధికార నాయకులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : కన్సిడరేషన్ ఫీజును తొలగించాలంటూ గని యజమానులు,కార్మికులు నిరసన దీక్షను కొనసాగిస్తున్నారు. నష్టాల బాటలో ఉన్న నాపరాతి పరిశ్రమను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే కన్సిడరేషన్ ఫీజును వసూలు చేసేందుకు సిద్ధమవడంతో గని కార్మికులు యజమానులు ఆందోళన బాట పట్టారు. వేలాదిమందికి జీవనోపాధి కల్పిస్తున్న నాపరాయి పరిశ్రమపై ఫీజు విధింపుతో మూసివేతే శరణ్యమంటున్నారు. డిఎంఎఫ్,డెడ్రెంట్, రాయల్టీ తదితర వాటితో సతమతమవుతున్న పరిశ్రమ మూడు సంవత్సరాల క్రితం తీసుకువచ్చిన కన్సిడరేషన్ ఫీజును ఈనెల 16 నుండి వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో గని యజమానులు కార్మికులు కూలీలు ఆందోళన చెందుతున్నారు. మూడు సంవత్సరాల నుండి గని పనులు చేపట్టి రాయల్టీ లు చెలించిన యజమానులు అదనంగా పీజు రూపంలో లక్షలాది రూపాయలు చెల్లించాల్సి రావడంతో ఉలిక్కిపడుతున్నారు. దీంతో మండలంలోని గనుల యజమానులు, కార్మికులు జిల్లా సరిహద్దులోని బందార్లపల్లి రాయల్టీ చెక్పోస్ట్ వద్ద నిరసన దీక్షను కొనసాగిస్తున్నారు. నిరసన దీక్ష అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోని కొనసాగుతుందని భావిస్తున్న ప్రధాన ప్రతిపక్ష వైసిపి క్యాడర్ దీక్షకు దూరంగా ఉన్నది. నాలుగు రోజుల నుండి నాపరాల సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో పనులు లేక కూలీలు కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న బనగానపల్లె నియోజకవర్గం నాపరాతి ఖనిజ ఖిల్లాగా ప్రసిద్ధి. బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల మండలాలలో వేలాదిమంది నాపరాయి పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. గుదిబండగా మారనున్న కన్సిడరేషన్ ఫీజును పూర్తిగా రద్దుచేసి పరిశ్రమను ఆదుకునేలా మంత్రి బిసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తులకు ప్రత్యేక రైలు

నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పార్లమెంటు పరిధిలోని ముస్లింలకు రైల్వే శాఖ శుభవార్త అందించిందని, నంద్యాల జిల్లాలోని డోన్, కర్నూలు రైల్వే స్టేషన్ మీదుగా అజ్మీర్ ఉరుసు కోసం వెళ్ళే భక్తులకు కేంద్ర రైల్వే శాఖ స్పెషల్ రైలు సౌకర్యంకల్పించిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే ట్రెయిన్ నెంబర్ 07119/07120 తిరుపతి - మదార్ జంక్షన్ - తిరుపతి రైలు నంద్యాల జిల్లాలోని డోన్ జంక్షన్ రైల్వే స్టేషన్ నుండి 02-01-25 గురువారం మధ్యానం 1:50కు బయలుదేరి అజ్మీర్ కి 04-01-25 శనివారం రోజున ఉదయం 4 గంటలకు చేరుకుంటుందని, అజ్మీర్ లోని ఉరుసు తదనంతరం మళ్ళీ తిరుగుప్రయాణంలో 09-01-25 (గురువారం) ఉదయం 4:30 గంటలకు అజ్మీర్ లో బయలు దేరి డోన్ జంక్షన్ కి 10-01-25 (శుక్రవారం) మధ్యాహ్నం 2:35 గంటలకు చేరుకుంటుందని, ఈ రైలు కర్నూలు, కాచిగూడ, నాగపూర్, భోపాల్ మార్గంలో అజ్మీర్ కు వెళ్తుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. ఇదే రైలు కర్నూలు మీదుగా వెళ్తుందని కాబట్టి నంద్యాల జిల్లా వాసులు కర్నూలు లేదా డోన్ నుంచి కూడా ప్రయాణం చేయవచ్చుననీ, అజ్మీర్ ఉరుసుకు వెళ్లే భక్తులు ఈ ప్రత్యేక రైలును ఉపయోగించు కోవాలని ఆమె కోరారు.

గుండెపోటుతో పాత్రికేయుడు మృతి

విశాలాంధ్ర - గడివేముల : గడివేముల మండల తెలుగు ప్రభ పాత్రికేయుడు మహబూబ్ బాషా(46) గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. గత నాలుగు రోజులు అస్వస్థతతో ఉండి చికిత్స తీసుకొని కోలుకున్నారు. కానీ ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని తోటి పాత్రికేయులు కన్నీటిపర్యంతం అయ్యారు. పాత్రికేయుడిగా మొదట పల్లెవెలుగు దినపత్రికలో పనిచేసాడు. అప్పటి నుండి పల్లెవెలుగు బాషా అనే నామకరణం తో అనతికాలం లోనే బాగా పాపులర్ అయ్యారని అంతలోనే ఇలాజరగడం బాధాకరమన్నారు. మహబూబ్ బాషా అకాల మరణంతో కుటుంబ సభ్యులకు, తోటి పాత్రికేయులు శోకసముద్రంలో మునిగిపోయారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలంలో అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకొని పవిత్ర పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఎక్కువ జాము నుండే క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. భక్తుల రద్దీకి అనుకూలంగా ఆలయ అధికారులు ఆలయ ఏర్పాట్లు చేశారు

24 నుంచి అంతర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని భాస్కరాపురం గ్రామం ఏబిఎం సంఘం అధ్వర్యంలో అంతర్రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఈనెల 24,25,26 తేదీలలో పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏబీఎం సంఘ పెద్దలు పెద్దలు తెలిపారు. అదివారం కబడ్డీ పోటీల కరపత్రాలు వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాస్కరాపురం గ్రామంలో అనేక సంవత్సరాల నుండి క్రిస్మస్ పండగ సందర్భంగా కబడ్డీ పోటీలు జరుగుతున్నాయని అందులో భాగంగా ఈ సారి ఎన్నడు లేని విధంగా దాతల సహకారంతో అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విజేత జట్లకు మొదటి బహుమతిగా 50 వేలు,రెండో బహుమతిగా 35 వేలు, మూడో బహుమతిగా 25 వేలు ,నాలుగో బహుమతి 15 వేల రూపాయలు అందజేస్తామన్నారు. ఈనెల 24వ తేదీలోపు ప్రవేశ రుసుము 500 చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలని వారు తెలిపారు. కబడ్డీ క్రీడాకారులకు ఉచిత భోజనం వసతి కల్పించడం జరుగుతుందని సంఘ పెద్దలు తెలిపారు. సెల్ నెంబర్లను సంప్రదించవలసిందిగా వారు తెలిపారు. వివరాలకు సంప్రదించవలసిన సెల్ నెంబర్లు 9701030603, 9642403482,9704962420,7989841124,9989793690.

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

విశాలాంధ్ర - వెలుగోడు : పేద ప్రజల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేల్పనూరు గ్రామంలో తన స్వగృహం నందు పేద లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ 44లక్షల 58 వేల రూపాయలను 22 మంది బాధితులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు,ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

విశాలాంధ్ర - పాములపాడు : జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్, ఆత్మకూరు రూరల్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి సూచనలతో పాములపాడు గ్రామ శివారులలో నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టిందనీ స్థానిక ఎస్సై సురేష్ బాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించారు. ఇప్పటికే డ్రోన్ కెమెరాలను ఉపయోగించి శివారు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం జరిగిందనీ ఆయన తెలిపారు. అంతేకాకుండా ఈ డ్రోన్ కెమెరాల వల్ల ఘటనా స్థలాలకు వెళ్లకుండా తాము ఉన్నచోటు నుంచే పసిగట్టి అసాంఘిక చర్యలు నివారించవచ్చు అని ఆయన తెలిపారు.

వసతులు శూన్యం..అవస్థలే నిత్యం

విశాలాంధ్ర - చాగలమర్రి : గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా పాఠశాలలను అఫ్‌గ్రేడేషన్, నాడు-నేడు పనులంటూ హంగామా చేసింది. దీంతో క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు దక్కలేదు. అరకొరగా నిధులను విడుదల చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వసతులు లేకుండా చేసింది. మండలంలోని గొడిగనూరు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలగా అప్గ్రేడ్ చేసింది. ఇక్కడ 222 మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఏడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం తొమ్మిది తరగతులు జరుగుతున్నాయి. రెండు తరగతుల విద్యార్థులకు వరండాలోనే పాఠాలు బోధిస్తున్నారు. నాడు-నేడు రెండో విడతలో స్థానిక పాఠశాలలో రూ.32 లక్షలతో రెండు అదనపు గదులను మంజూరు చేశారు. నిధులు అరకొరగా రావడంతో సరిపోక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఫలితంగా విద్యార్థులకు వరండా లోనే పాఠాలు బోధిస్తున్నారు.

నిలిచిపోయిన భవనం

స్థానిక పాఠశాలకు నాడు - నేడు రెండో విడతలో రూ 32 లక్షలు నిధులు మంజూరయ్యాయి.నిధులు సరిపడక భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా మూడు గదులు అవసరం..

ఓబులపతి, హెచ్ఎం, గొడిగనూరు..

గొడిగనూరు ఉన్నత పాఠశాలకు మరో మూడు గదులు అవసరం అవుతాయి. ప్రస్తుతం పాఠశాలలో ఏడు గదులు మాత్రమే ఉన్నాయి. రెండు తరగతులకు వరండాలో చెబుతున్నాం. మరో మూడు గదులు,ఆఫీస్‌కు వసతులు అవసరం ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి వసతి కల్పించాలి.

సీపీఐ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-డోన్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100 సంవత్సరాల వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, డోన్ మండల కార్యదర్శి బి.నారాయణ పార్టీ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక నక్కి రామన్నభవనంలో డోన్ పట్టణ శాఖ కార్యదర్శులు ముఖ్య నాయకుల సమావేశం పట్టణ సహాయ కార్యదర్శి ఎన్.కె రామమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిందని అప్పటినుండి నేటి వరకు పేద ప్రజలు కార్మికుల కర్షకుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతున్న వంద సంవత్సరాలు నిండిన ఏకైక పార్టీ సీపీఐ అని వారన్నారు. పార్టీ నాయకులు ప్రజలతోమమేకమై బలమైన సంబంధాలు ఏర్పరచుకున్నప్పుడే పార్టీ నిర్మాణం బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు.సీపీఐ పార్టీకి పదవులు, అధికారం ముఖ్యం కాదని.. ప్రజా సమస్యలే అజెండాగా పోరాడుతున్న పార్టీ అని అన్నారు. ఈ వార్షికోత్సవాలను పండుగల నిర్వహించుకోవాలని పార్టీ శ్రేణుల కు తెలిపారు. పార్టీ శాఖలు ఉన్న ప్రతి చోట జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డోన్ పట్టణ కార్యదర్శి మోటరాముడ, డోన్ మండల సహాయ కార్యదర్శి ఆర్.వరదరాజులు, మహిళా సమాఖ్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షమీంబేగం, ఏఐటియుసి డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లయ్య, పార్టీ శాఖ కార్యదర్శులు,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-డోన్ : డోన్ పట్టణంలోని అమ్మ హెూటల్ సర్కిల్ నందు ఏ ఐ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే భగత్ సింగ్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని డోన్ పట్టణంలోని నక్కి రామన్నభవనంలో ఆదివారం ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతాప్ మాట్లాడుతూ 'రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పోరాడి 23 సంవత్సరాలకే ఉరి కొయ్యలను వరమాలలుగా స్వీకరించి, చిరునవ్వుతో ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు 'సర్దార్ భగత్ సింగ్'' అని వారు అన్నారు.నేటి సమాజంలో యువత అంతా సినిమా హీరోలను ఆదర్శంగా తీసుకొని మత్తు, చెడు అలవాట్లలకు బానిసలు అవుతున్నారనీ, సినిమా హీరోలను కాదు నిజ జీవిత హీరోలు అయినటువంటి స్వాతంత్ర్య సమరయోధులు, భగత్ సింగ్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేటి సమాజంలో ఈ ప్రభుత్వాలు పాలిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. దేశద్రోహుల చరిత్ర కాదు దేశం కోసం ప్రాణాలర్పించినటువంటి స్వాతంత్ర్య ఉద్యమకారుల యొక్క జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి విద్యార్థులకు వారి జీవిత ఆశయాలు, ఆదర్శాలను బోధించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వెయ్యాలన్నారు.'భగత్ సింగ్ గ్యారెంటీ ఎంప్లాయిమెంట్ యాక్ట్' ను అమలు చేసి దేశంలో ఉన్నటువంటి నిరుద్యోగులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ భగత్ సింగ్ విగ్రహ ఆవిష్కరణకు మేధావులు,భగత్ సింగ్ ను అభిమానించే వారందరూ మరియు విద్యార్థులందరూ కూడా ఆహ్వానం పలుకుతున్నారని,కావున పెద్ద ఎత్తున ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శశిధర్ రెడ్డి, మనోజ్, మండల కార్యదర్శి సాయి, సిద్దు, మండల ఉపాధ్యక్షులు ప్రవీణ్, అస్లాం, హేమంత్,మండల నాయకులు మహేష్,మంజు, కిరణ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తెలుగు గంగ చైర్మన్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : సాగునీటి ఎన్నికల్లో తెలుగు గంగ నంద్యాల జిల్లా చైర్మన్ గా చెన్నారెడ్డి గారి సంజీవ్ కుమార్ రెడ్డిని ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ని ఆళ్లగడ్డ స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చైర్మన్ సంజీవ్ కుమార్‌కి అభినందనలు తెలిపారు. రైతులందరికి అందుబాటులో ఉంటూ సాగునీరు అందించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి గారి జనార్దన్ రెడ్డి ఉన్నారు.

కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహణ

సరైన ధ్రువపత్రాలు లేని 13 మోటార్ సైకిళ్ళు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణే లక్ష్యంగా నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు తెల్లవారుజామున రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, స్థానిక పోలీసులు, క్యుఆర్టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వనగర్ నందు కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వనగర్ నందు నేర చరిత్ర గలవారు, అనుమానితులు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించిన్నట్లు సిఐ ఇస్మాయిల్ తెలిపారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 13 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న లక్ష్మీ నరసింహ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : యేసుక్రీస్తు క్రీస్తు భోదించిన మాటలు ఈ ప్రపంచానికి మార్గదర్శనమని, క్రైస్తవుల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీయేనని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ముసాని శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి మెంబర్, నంద్యాల పార్లమెంట్ జిల్లా డీసీసీ అధ్యక్షులు లక్ష్మినరసింహ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో క్రిస్మస్ కేకు ను కట్ చేసి ఏసు క్రీస్తు పేరిట ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మతాలను, సమానంగా గౌరవించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, సర్వమత స్వేచ్ఛకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, క్రైస్తవుల హక్కుల కోసం వారి సంక్షమానికి గత జగన్ ప్రభుత్వం కానీ ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం గానీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని, ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం చంద్రబాబునాయుడు గాలికి వదిలేసారని, ఇంతవరకు క్రైస్తవులకు క్రిస్మస్ తోఫా కూడా ఇవ్వలేదని వారు ఆరోపించారు. కర్నూలు జిల్లా సిటీ అధ్యక్షులు జిలాన్ భాషా, పీసీసీ మెంబర్స్ పఠాన్ హబీబ్ ఖాన్,బాల స్వామి, మైనారిటీ జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షులు బోయ రమణ,జిల్లా జనరల్ సెక్రటరీ సుబ్బు యాదవ్,జిల్లా కార్యదర్శి రజాక్ తదితరులు పాల్గొన్నారు.

గురురాజా విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధనశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా విజయవాడ నగరంలో నిర్వహించిన స్టేట్ లెవెల్ లఘు చిత్ర ప్రదర్శన కాంపిటీషన్ నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ నందు గల శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ఎస్. ఫర్హాన్ ఎనిమిదో తరగతి ఒలంపియాడ్ విద్యార్థి స్టేట్ బెస్ట్ ప్రతిభ అవార్డును సాధించారని స్కూల్ డైరెక్టర్ పి. షేక్షావలిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఇంధన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయనంద్, ఏపీ జెన్కో ఎండి కేఎస్ చక్రధర్ స్టేట్ లెవెల్ బెస్ట్ ప్రతిభ అవార్డును అందించారు. స్టేట్ లెవెల్ లో 13 పాఠశాలలు ఎంపిక కాగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్టేట్ లెవెల్‌కి ఎంపికైన ఏకైక పాఠశాల శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ అని సంతోషం వ్యక్తం చేసారు. బాల్య దశలోనే ప్రజలకు ఇంధన పొదుపు పట్ల అవగాహన కల్పించుటకు ఇటువంటి కార్యక్రమాలను మా పాఠశాల నందు అనునిత్యం నిర్వహిస్తున్నామని, కాంపిటీషన్ నందు చక్కని శిక్షణ అందించిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

బీసీ సమస్యలను పరిష్కరించాలి..

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బీసీ సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రఘు రాముడు యాదవ్, గౌర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మన్యం బాలస్వామి యాదవ్, ఉపాధ్యక్షుడు వీరన్న, ప్రచార కార్యదర్శి రమణ యాదవ్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అత్యధిక శాతం కలిగిన బీసీలకు కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవులలో బీసీలకు అత్యధిక శాతం కేటాయించాలని, ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు చైర్మన్ గత ప్రభుత్వం బీసీలకు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం కూడా మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని బీసీల కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలో బీసీ భవన్ కు స్థలం కేటాయించి, భవనము నిర్మించి ఇవ్వాలని బీసీ నాయకులు కోరారు. జన కులగనణ చేసినప్పుడే బీసీలకు తగిన సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపాలని, ప్రైవేటు ఉద్యోగాలలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని వారు తెలిపారు.

పెండింగ్ డీఏలు ప్రకటించాలి

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : ఎన్నికల హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంక్రాంతి కానుకగా కరువుభత్యం (డి.ఏ) ప్రకటించి, పీఆర్సీని నియమించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2023 జులై నుండీ పీఆర్సీ అమలు చేయాల్సి ఉందని ఇప్పటికే 16 నెలలు గడచి పోయిందని,సమూచిత రీతిలో మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన తెలిపారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కూటమి ప్రభుత్వం పై పెట్టుకున్న ఆశలు వమ్ము చేయరాదని విజ్ఞప్తి చేశారు. పిఫ్, ఏపిజిఎల్ఐ, బకాయిలు తక్షణం చెల్లించాలని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలని మర్రిపల్లెకు చెందిన సామాజికవేత్త అబ్దుల్ గఫార్ అన్నారు. ఆళ్లగడ్డ మండలంలోని గ్రామాలలో ఆదివారం రోడ్డు ప్రమాదాలపై ఆటో ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణం ఆకలితో ఉందని, ప్రజలు దైవ దర్శనానికి వెళ్లిన చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే రాజకీయ నాయకులైన, పిల్లలైనా, పెద్దలైన, సినిమా హీరోలైన, దేశానికి సేవ చేసే జవాన్ లైనా రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి పిల్లలు ఎంతోమంది అనాధలుగా మిగిలారని, అలా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ దైవాన్ని ప్రార్థిస్తూ రోడ్డుపై ప్రయాణించాలన్నారు.

24న మార్కెట్ వేలంపాట

విశాలాంధ్ర - బండి ఆత్మకూరు : మండల కేంద్రంలోని సంత మార్కెట్ ఈనెల 20వ తేదీన బహిరంగ వేళ పాట నిర్వహించినట్లు పంచాయతి కార్యదర్శి షేక్ అక్బర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు. గ్రామపంచాయతీ నిర్ణయించిన డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. అలాగే 2000 రూపాయలు బండ్ల మెట్ల. 3000 రూపాయలు మటన్ మార్కెట్ వేలంలో పాల్గొనేవారు 1000 రూపాయలు చెల్లించాలని ఆయన తెలిపారు వేలంపాట తగ్గించుకున్న వారు లబ్ధిదారులు వారం లోపల పాడిన మొత్తాన్ని చెల్లించాలన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండీ ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల దేవ నగర్‌లో క్రిస్మస్ ఆరాధన పేరుతో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలు చిన్నారుల ఆట పాటలతో సందడిగ కొనసాగింది. కార్య నిర్వహకులు కల్వరి కరుణ ప్రార్థన మందిరం వ్యవస్థా పకులు పాస్టర్ కే.అనిల్ కుమార్, కాలని వాసుల ఆహ్వానం మేరకు వేడుకల్లో ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ పవిత్రమైన ఏసుక్రీస్తు జన్మదిన సంబరాల్లో భాగంగా సెమీ క్రిస్మస్ వేడుకల్లో మతాల అతీతంగా కాలని వాసులందరు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందంటూ ప్రతి సంవత్సరం ఇలాగే ఐకమత్యంతో అన్నీ పండుగలు చేసుకోవాలని కోరారు. పాస్టర్ మన్యం జానయ్య,భాస్కర్, ఖాజా మొహిద్దిన్, సురేష్, వెంకటేశ్వర్లు, ప్రకాష్,విజయ్,అల్తాఫ్, వెంకట్ అసోసియేషన్ సభ్యులు,టిడిపి నాయకులుపాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఇచ్చట ప్రయాణం ఎంతో హాయినిచ్చునులే..

విశాలాంధ్ర -హొళగుంద: హొళగుంద నుండి హెబ్బటం మీదుగా ఆదోనికి వెళ్లే రస్తా మార్గంలో అటవీశాఖ అధికారులు పెంచిన చెట్లు ప్రజలకు ఎంతో ఆనందాన్నిస్తున్నాయి. అసలే అధ్వాన్నంగా ఉన్న రోడ్ల మీద ప్రజలు ఎంతో కష్టపడి ప్రయాణిస్తున్న తరుణంలో పచ్చని చెట్లు, పక్షులు కిచకిచల మధ్య ప్రయాణించడం పట్ల ప్రజలు రోడ్డు కష్టాన్ని మరిచిపోతున్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ అందక ఎందరో ప్రాణాలు విడిచారు. చెట్లు ఆక్సిజన్ వదలడం వల్ల ప్రజలు చెట్లనుండి ఆక్సిజన్ పీల్చుకుంటారు. చెట్లు కూడా ప్రజలు వదిలిన కార్బన్డయాక్సైడ్‌ను పీల్చుకొని పెద్దవిగా పెరుగుతున్నాయి. చెట్లను పెంచడం వల్ల ఆక్సిజన్‌తో పాటు సేంద్రీయ ఎరువు లభిస్తుందని, చెట్లు నీడను ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. రోడ్డు వెంబడి ప్రయాణించే ప్రజలు చెట్లను చూసి ఆనందిస్తూ పక్షుల కలర వాలను వింటూ ప్రయాణిస్తున్నారు. అధికారులు రోడ్డు ఇరువైపులా చెట్లను పెంచి పెద్దవి చేయడం వల్ల ఎంతో ఆనందం కలుగుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో మండే సూర్యుడి తాపానికి తట్టుకోలేక ప్రజలు చెట్ల కింద సేదతీరుకొని తమ గమ్యస్థానాలను చేరుకుంటున్నారు. చెట్లు రోడ్డు ఇరువైపులా పెంచడం వల్ల పొలాల గట్టుకు ఎంతో భద్రత కలిగిస్తున్నాయని రైతులు తెలిపారు. అందుకోసం అందరం కలిసి చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని చెట్ల ప్రేమికులు విజ్ఞప్తి చేశారు

తరలిన అధికారులు..

విశాలాంధ్ర - ఆదోని : తాగునీటిపై సంధిగ్ధతత.. ముంచుకొస్తున్న నీటి ప్రమాదం అనే శీర్షికతో డిసెంబర్ 7వ తేదీన ప్రచురితమైన వార్తకు స్పందించిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదివారం మున్సిపల్ సిబ్బందిని వెంటబెట్టుకుని బసాపురం ఎస్ఎస్ ట్యాంక్‌ను పరిశీలించారు. పట్టణంలో నీటి సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోవాలని వార్త ప్రచురించడంతో ఈ విషయమై డిసెంబర్ 18వ తేదీన జరిగిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో కౌన్సిలర్ సందీప్ రెడ్డి నీటి సమస్యపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పార్థ సారధిని, మున్సిపల్ అధి కారులను ప్రశ్నించారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు రెండు వైపులా సైడ్ వాళ్లు పడిపోవడంతో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేమలేని పరిస్థితి నెలకొనింది. రాబోవు వేసవి కాలనీ దృష్టిలో పెట్టుకొని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మున్సిపల్ సిబ్బందితో కలిసి త్వరితగతిన పనులు ప్రారంభించి, నీటి సమస్య తలెత్తకుండా చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. సబ్ కలెక్టర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ ఇంతియాజ్ అలీ, డీఈఈ గోపీ నాథ్, డ్వామా ఏపీడీ లోకేశ్వర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ మధు కృష్ణ ఆచారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

బురదకుంటను తలపిస్తున్న వీధి రస్తా...

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుంద సిద్ధప్ప కాలనీ వీధి రస్తా బురదకుంటగా మారడంతో ప్రజలు బురద గుంటలోనే నడుస్తున్నారు. కొత్తగా నిర్మించిన డ్రైనేజీ నీరు, ఇతర మురికినీరు రోడ్డు మధ్యలో చేరడంతో వాహనాలు వెళ్ళక వాహనాలను దూరంగా పెట్టి ఇంటికి చేరుకుంటున్నామని ఆదివారం తెలిపారు. రోడ్డు పక్కనే పెద్ద వంక ఉన్నదని పాల చెరువు పూర్తిగా నిండితే నీరు వంక ద్వారా ప్రవహించేవని అయితే కొందరు అక్రమ కట్టడాలు నిర్మించుకోవడం వల్ల నీరు ప్రవహించక రోడ్డు మీద నిలబడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. కాలనీ మహిళలు మాట్లాడుతూ మురికి నీరు రోడ్డు మధ్యలో నిలబడుతున్నాయని, మురికి నీటిలోనే తాము నడుస్తున్నా మని మనమేమి చేయాలి అన్నారు. అధికారులు వంకను మరమ్మతు చేస్తే కాలనీ నీరంతా వంక ద్వారా ప్రవహిస్తాయని, అధికారులు స్పందించి వీధిరస్తాలో మురికి లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ చలువాది రంగమ్మ సమాధానం ఇస్తూ వంకలో జెసిబి వెళ్ళదని, వంక మరమ్మతు చేయలేకపోయానన్నారు. ఉపాధి హామీ కూలీల ద్వారా వంకమురమ్మకు చేస్తామని వీధి రాస్తాలో నీరు లేకుండా చూస్తామని అన్నారు.

11 గ్రామాలలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

విశాలాంధ్ర - కర్నూలు: జిల్లాలో సోమవారం 11 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని కోసగి మండలంలోని దొడ్డి గ్రామం,మంత్రాలయం మండలంలోని దిబ్బన దొడ్డి గ్రామం,పెద్దకడబూరు మండలంలోని చిన్న తుంబలం గ్రామం, ఆదోని మండలంలోని బలదూర్ గ్రామం, ఎడవల్లి గ్రామం,కౌతాళం మండలంలోని కరణి గ్రామం. తిప్పలదొడ్డి గ్రామం, కర్నూలు రెవెన్యూ డివిజన్లోని ఓర్వకల్లు మండలంలోని హుస్సేనాపురము గ్రామం, గూడూరు మండలంలోని గూడూరు గ్రామం, పత్తికొండ రెవెన్యూ డివిజన్లోని దేవనకొండ మండలం తర్నేకల్లు గ్రామం, వెల్మకూరు గ్రామమాల్లో మొత్తం 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

అమీషాను వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా

విశాలాంధ్ర -వెల్దుర్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ పట్ల పార్లమెంట్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించాలని ఆదివారం స్థానిక పాత బస్టాండ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి టీ.కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేషు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి డి.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు చిలిపి కృష్ణ, వెంకటేశ్వర్లు, చిన్నమదులు, సుధీర్ నాయుడు, మనోహర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఎస్ఎల్‌టీఏ క్యాలెండర్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆవిస్కరించారు. నగరంలోని గౌరు స్వగృహంలో ఎస్ఎల్‌టీఏ క్యాలెండర్ ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరణ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు ఎం.బాలన్న, రాష్ట్ర కార్యదర్శి ఎన్.మద్దిలేటి జిల్లా, గౌరవ అధ్యక్షులు యోగేశ్వర రెడ్డి, జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సలీం బాష, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల వ్యవస్థాపక దినోత్సవాలు జయప్రదం చేయండి : కె.జగన్నాథం

విశాలాంధ్ర - కర్నూలు: సీపీఐ శత జయంతి దినోత్సవం జయప్రదం చేయాలని సీపీఐ సినియర్ నాయకులు కె.జగన్నాథం పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ నగర కార్యవర్గం, శాఖ కార్యదర్శి సమావేశం పార్టీ కార్యాలయంలో నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంకి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ భారతదేశంలో సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా కర్నూలు నగరంలో అన్ని శాఖలలో పార్టీ జెండాలను ఆవిష్కరించుకొని ఈ నెల 31 తారీకు పెద్ద ఎత్తున బహిరంగ సభ జరుపుకోవాలన్నారు. ఈ సభకి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య హాజరవుతున్నారన్నారు. శాఖలో ఉన్న సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఈ వంద సంవత్సరాల కాలంలో పేద, బడుగు, బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. దున్నేవాడికే భూమి కావాలంటే పోరాటం చేసి ఈ దేశంలోనే భూమిలేని నిరుపేదలకు లక్షల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు నాగరాజు, అన్వర్, కుమార్, సోమన్న, ఈశ్వర్, నల్లన్న, వెంకటేష్, శాఖా కార్యదర్శులు చులోచనమ్మ, సత్యం, మున్ని, అమ్మినాభి, రబియా, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

శతజయంతి వారోత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: సీపీఐ వందేళ్లలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా శతజయంతి వారోత్సవాలను సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకన్న కోరారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నాగనాథనహళ్లి గ్రామ శాఖ కార్యదర్శి సిద్దలింగ అధ్యక్షతన శాఖ కార్యదర్శిల సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ సీపీఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవిం చిందని, అప్పటి నుండి అనేక పోరా టాలు నిర్వహిం చడం దేశానికి సంపూ ర్ణ స్వాతంత్రం కావాలని స్వాతంత్ర సంగ్రామంలో అనేకమంది ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. 4500 మంది కమ్యూనిస్టుల ప్రాణాలు బలిదానాల ద్వారా పది లక్షల ఎకరాలకుపైగా సాగు భూములను పేదలకు పంచిన ఘన చరిత్ర గలిగిన పార్టీ అని కొనియాడారు. ఈ సమావేశంలో కొత్తూరు గంగన్న, చిన్న హరివణం సత్య నారాయణ, బైచిగిరి కిషన్ సింగ్, దాణాపురం కాజా, 104 బసాపురం కరెంటు ఈరన్న, ధనాపురం ఉదయ్ కుమార్ దొడ్డనకేరి శేశిరెడ్డి పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకు వెళ్లిన ఆర్టీసీ బస్సు

విశాలాంధ్ర-హొళగుంద: ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదోని నుండి హొళగుంద, ఎల్లార్తి గ్రామాలకు వస్తుండగా ఆదివారం హొళగుంద సమీపంలో అదుపుతప్పి బస్సు పొలంలోకి దూసుకెళ్లింది. స్టీరింగ్ హార్డు కావడంతో కంట్రోల్ చేసినా అదుపు కాక బస్సు పొలంలోకి దూసుకుపోయి రోడ్డుకు అడ్డంగా నిలబడింది. బస్సు రోడ్డుకు అడ్డంగా నిలబడడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. బస్సు వల్ల ట్రాఫిక్ జామ్ అయింది. బస్సులో 45 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు బస్సు కొద్దిగా ముందుకు పోయి ఉంటే పెద్ద ప్రమాదం సంభవించేది. రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల కొత్త డ్రైవర్‌కు రోడ్డు స్థితిగతులు తెలియక బస్సు పొలాల్లోకి వెళ్లి నిలబడింది. ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో ప్రయాణికులు బస్సులోంచి దిగి తన గ్రామాలకు ఇతర వాహనాల మీద ప్రయాణించారు. ప్రైవేట్ జేసీబీ యంత్రం ద్వారా బస్సును బయటకు లాగి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. దీనితో ప్రజల రాక పోకలు జరిగాయి. బస్సు సర్వీసు యధావిధిగా కొనసాగింది.

గుండెపోటుతో న్యాయవాది మృతి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలు బార్ అసోసియేషన్‌లో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది సురేష్ (58) న్యాయవాద వృత్తి ఉండి జీవించేవారు. హార్ట్ ఎటాక్ సురేష్ రావడం చాలా బాధాకర విషయం మంచి వ్యక్తి కోల్పో యామని కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, ప్రాగడప సంతాపన తెలియజేశారు. జిల్లా కోర్ట్ ఆవరణంలో సంతాప సభ నిర్వహిస్తామని వారు తెలిపారు.

అనాధ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర - కోసిగి : మండల కేంద్రమైన కోసిగి స్థానిక ఎల్లమ్మవ్వ గుడి ఆవరణంలో గత కొద్దిరోజులుగా ఆవాసం ఏర్పరచుకున్న బిక్షాటన చేస్తూ జీవనం చేస్తున్న అనాధ పురుషుడు(60) ఆదివారం మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు సర్పంచ్ అయ్యమ్మ, ఈవో తిరుమలేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు మాణిక్యరాజు, యువ నాయకులు రాజేష్ సమక్షంలో పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించడంతో సర్పంచ్ అయ్యమ్మను, గ్రామస్తులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రాజు, శీను, తాయన్న, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డేశారు.. మట్టేయడం మరిచారు

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని గజ్జెహళ్లిలో పల్లె పండుగ రూ.5 లక్షల రూపాయల నిధులతో కాంట్రాక్టర్ సిమెంట్ రోడ్డు వేశారని, అయితే రోడ్డు పక్కన మట్టి వేయకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆదివారం తెలిపారు. రోడ్డు వేసి నెలలు గడుస్తున్నా రోడ్డు పక్కన ఎర్ర మట్టి వేయకపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు తిరగాలన్న కష్టంగా ఉందని, రోడ్డు నిర్మాణానికి వేసిన క్యూరింగ్ నీటితో పాటు చెత్త, చెదారం కూరుకుపోవడంతో కాలనీలో దుర్వాసం వస్తుందని ప్రజలు ఆరోపించారు. రోజు రోడ్డుపై తిరగాలన్న ఇబ్బందిగా ఉందంటున్నారు. రోడ్డుపై భారమైన వాహనాలు తిరగలేక, పండించిన పంటలు ఇంటికి తరలించాలంటే నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవూప వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు శ్రద్ధ వహించి రోడ్డువక్కన ఎర్ర మట్టి వేస్తే రాకపోకలకు సులభంగా ఉంటుందని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఏఈ యమునప్పను సంప్రదించగా కొత్త రోడ్డుకు క్యూరింగ్ పనులు జరుగుతున్నాయని, అందువల్ల మట్టిని వేయలేకపోయామని, రోడ్డు కొలతలు తీసుకున్నామని, కాంట్రాక్టర్‌కు చెప్పి ఎర్రమట్టి వేయిస్తామని అన్నారు. రోడ్డుపై తిరగడానికి అనుమతిస్తే భారమైన వస్తువులతో ట్రాక్టర్లు తిప్పడం వల్ల రోడ్డు దెబ్బతింటుందని రెండు నెలల వరకు జాగ్రత్తగరోడ్డును కాపాడుకోవాలని అన్నారు.

నియోజకవర్గ ఇంచార్జీ సహకారంతోనే పదవి

విశాలాంధ్ర - కోడుమూరు : నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి డి.విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతోనే తనకు గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి దక్కిందని నూతనంగా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన మల్లికార్జున గౌడ్ అన్నారు. శనివారం కర్నూలులో గాజుల దిన్నె ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా కోడుమూరు చెందిన కేఈ మల్లికార్జున గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరు లతో మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ డి.విష్ణు వర్ధన్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి, ఆయన చేసిన కృషి చేసి వల్లే ప్రాజెక్టు చైర్మన్ పదవి వరించిందని చెప్పారు. ఆయన నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కోడుమూరులో టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఘనంగా గణిత మేధావి రామానుజన్ జయంతి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాల సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సుప్రసిద్ధ భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్ కుమార్ అధ్యక్షతన వహించగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఏ అంశాన్ని సబ్జెక్టును ఎంచుకున్నప్పటికీ దానిపై అంకితభావంతో కృషి చేసినప్పుడే జీవితంలో అద్భుతంగా ఎదగాలపాకన్నారు. రామా నుజన్ వంటి గణిత మేధావి స్ఫూర్తితో కృషిచేసి కళాశాలకు దేశానికి గొప్ప పేరు తీసుకు రావాలని ప్రిన్సిపల్ విద్యార్థులను ఆకాంక్షించారు. గణిత విభాగాధిపతి టీ. చంద్రశేఖర్, గణిత అధ్యాపకులు డాక్టర్ ఓబులేష్, సురేష్ బట్టు, క్లస్టర్ యూనివర్సిటీ టీం ఎగ్జామినేస్ డాక్టర్ కె.నాగరాజు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు తప్పనిసరి

విశాలాంధ్ర - ఆదోని : విద్యార్థులు చదువుతోపాటు క్రీడ పోటీల్లో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదివారం సైన్స్ కళాశాల మైదా నంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ ఆక్టివిటీస్ 2024-25 యాన్యువల్ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ చిన్నపరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ దశరథ రామిరెడ్డి, అధ్యక్షుడు సందీప్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సునీల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పోటీలు ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, యూత్ ఆఫీసర్ సాబిర్ అహ్మద్ కాగడ ను చేత పట్టుకుని గ్రౌండ్లో తిరిగి ఆటల పోటీలను ప్రారంభించారు. ఆటల పోటీల్లో 40 స్కూళ్ల నుండి దాదాపు 1500 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైతున్యాన్ని వెలుగు తీసేందుకు క్రీడ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మానసికంగా చాలా దృఢంగా ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు యూత్ ఆఫీసర్ రాజేష్ జైన్, సభ్యులు శ్రీధర్ రెడ్డి, భరత్ షా, ప్రశాంత్ గాంధీ, సుబ్బయ్య, బసవరాజు, వీరేష్ స్వామి, పద్మనాభయ్య శెట్టి, శేషయ్య, నితిన్, శివరాం, హుస్సేన్ బాష తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు తక్షణమే ప్రమోషన్‌లు ఇవ్వాలి

విశాలాంధ్ర - తుగ్గలి: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ స్థాయిలో పని చేస్తున్న విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు తక్షణమే విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లుగా ఆఫీసర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని వీఆర్ఏ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం తుగ్గలి లోని తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏల సమావేశం నిర్వహించారు. అనంతరం వీఆర్ఏల జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్న వీఆర్ఏలకు తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. గౌరవ అధ్యక్షులుగా చౌడప్ప, అధ్యక్షులుగా వెంకటేశు, ఉపాధ్య క్షులుగా సూర్య నారాయణ, కార్యదర్శిగా నగేష్, కోశాధికారిగా రామాంజనేయులు, జాయింట్ కార్యదర్శిగా శివ, కార్యవర్గ సభ్యులుగా రామచంద్ర, మురళి, చెన్న కేశవులు, రాకేష్, రంగన్నను ఎన్నుకొన్నట్లు తెలుపారు.

గూడూరులో రక్త దాన శిబిరం

విశాలాంధ్ర-గూడూరు: తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు యువతి, యువకులు రక్తదానం చేశారు. ఆదివారం గూడూరు పట్టణంలో యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపుగా 30 మంది యువతీ యువకులు రక్తదానం చేసినట్లు కర్నూలు బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణదాతలు కావాలని యువతీ యువకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె జూనియర్ కాలేజ్ అధ్యాపకులు ఎ.రామన్న, చిరు సేన నాయకులు రవి ప్రతాప్, ఏం సంజయ్, రక్త దాన దాతలు దండు ముకుంద రాజు, సువర్ణమ్మ, బుజ్జమ్మ, రాజేష్ ,కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పైప్‌లైన్ గుంతలు

విశాలాంధ్ర-హొళగుంద: హొళ గుంద నుండి వంద వాగలికి మంచి నీటి సర ఫరా చేసే పైప్ లైన్ మరమ్మత్తు కోసం అధికారులు రోడ్డు పక్కన గుంతలు తగిలి వదలడం వల్ల ప్రమాదకరంగా మారాయని ప్రజలు భయాం దోళన చెందుతున్నారు. రోడ్డు పక్కనే గుంతలను తవ్వి మట్టిని రోడ్డుకు అడ్డంగా వేశారని, దీనివల్ల రాకపోకలకు కష్టంగా ఉన్నదని ప్రజలు ఆవేదన చెందారు. భారీ ఎత్తున మట్టి కుప్పలు వేయడం వల్ల ఎదు రుగా వచ్చే వాహనాలు కనబడకుండా పోతున్నాయని, దీనివల్ల ప్రమా దాలు జరుగుతున్నాయని అన్నారు. భారీ ఎత్తున గుంతలు తవ్వి నిర్ల క్ష్యంగా అధికారులు వదిలేశారని గుంతలు, మట్టి వల్ల నానా అవస్థలు పడి ప్రయాణిస్తున్నామని ప్రజలు తెలిపారు. మండలాధికారులు మంచినీటి పైప్లైన్ గుంతలను పూడ్చి, రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి కుప్పలు తొలగించాలని ప్రజలు కోరారు.

ఘనంగా పీవీ రావు 19వ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: పట్టణంలోని సంజీవయ్య నగర్లో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులుపీవీ రావు 19వ వర్ధంతి సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న, బుడిమద్దుల రవిచంద్రలు పీవీ రావు చిత్ర పటముకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల ఐక్యత కోసం తన తుది శ్వాస విడిచే వరకు పోరాటం చేసిన పోరాటయోద్దుడు పీవీ రావు అని కొనియాడారు. తన ఐఏఎస్ ఉద్యోగం ను రాజీనామా చేసి అంబేద్కర్ ఆశయాలలో పోరాటం చేసిన మహానుభావుడు పీవీ రావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువజన హక్కుల కోసం యువత పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - కోడుమూరు : దేశం, రాష్ట్రంలో యువజన హక్కుల కోసం,మెరుగైన విద్య,వైద్యం,ఉపాధి హక్కుల కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి యువతకు పిలుపు నిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో రంగ స్వామి అధ్యక్షత ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీ సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు శేషుకుమార్ యాదవ్ మాట్లాడుతూ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కల్పించకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తూ యువతను తప్పుదారిలో పయనించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి కల్పించకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను మునివేసే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను మొత్తం ఆదాని, అంబానిలకు అప్పచెప్పి వారికీ ఊడిగం చేస్తున్నారని వాపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్న డిఎస్సిపై పూర్తిగా నిర్ణయం తీసుకోక పోవడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారని, గ్రూప్ 1, 2, పోలీస్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు అల్తాఫ్, వీరంజి, శ్రీకాంత్, సంజీవ్, మునిస్వామి, వీరేంద్ర, సిద్దు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక: సమావేశం అనంతరం ఏఐవైఎఫ్ మండలం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్ తెలిపారు. అధ్యక్షులుగా సిద్దు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా అల్తాఫ్,కిషోర్, వీరాంజనేయులు, కిరణ్, సహాయ కార్యదర్శులుగా మల్లి, మునిస్వామి, పులి, ఈశ్వరప్ప, కోశాధికారిగా రంగస్వామి లతో పాటు కార్యవర్గ సభ్యులుగా 18 మంది, సమితి సభ్యులుగా 31 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాల్మీకులు ఏకమై ఎస్టీ జాబితాను సాధిద్దాం

విశాలాంధ్ర - తుగ్గలి: రాష్ట్రంలోని వాల్మీకులంతా ఏకమై ఎస్టీ జాబితాను సాధిద్దామని బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ళ తలారి రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మారెళ్ళ గ్రామంలో బోయ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు తలారి రామాంజనేయులు ఆధ్వర్యంలో వాల్మీకి గర్జన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు టీడీపీ రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆదోని టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ రామకృష్ణలు హాజరయ్యారు. అనంతరం ఈ సభను ఉద్దేశించి కపట్రాల్ల బొజ్జమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సలహా మేరకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ వాల్మీకులు అందరూ ఐకమత్యంతో ఉండాలని అందుకు ప్రతి ఒక్క వాల్మీకి కుటుంబం నుంచి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు కలిసికట్టుగా ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల నుండి వాల్మీకి సంఘం నాయకులు కుబేర స్వామి, గుంటకల్ పరుశురాం, ఆదోని కౌన్సిలర్ సురేష్, విరుపాపురం మాజీ ఎంపిటిసి శివకృష్ణతో పాటు ముక్కెళ్ల సర్పంచ్ సలహాదారుడు రామచంద్ర, వాల్మీకి సంఘం నాయకులు ఘన మద్దిలేటి, చిరంజీవి, నునుసురాళ్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 23, డిసెంబర్ 2024

నిరంతర వైద్య విద్య ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల, కర్నూలు జిల్లాల నేత్ర వైద్యుల సంఘాల సంయుక్త నిర్వహణలో ఆదివారం స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశభవనంలో ఆంధ్రప్రదేశ్ నేత్ర వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆప్తాల్మిక్ సొసైటీ అకాడమిక్ రీసెర్చ్ కమిటీ పర్యవేక్షణలో నేత్ర వైద్యుల కోసం కంటిలో గ్లకోమా సమస్యలు అన్న అంశంపై ప్రాంతీయ వైజ్ఞానిక వైద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల జిల్లా నేత్ర వైద్యుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ విజయ భాస్కరరెడ్డి, చీఫ్ పాట్రన్ డాక్టర్ జగన్మోహన్ నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ నర్సిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మహిళా వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, రాష్ట్ర ఆప్తాల్మిక్ సొసైటీ అకాడమిక్ రీసెర్చ్ కమిటీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ అన్ని విభాగాల వైద్యులు నిరంతరం వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం ద్వారా తమ వైద్య విజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవాలని, ఆధునిక వైద్య విధానాలు, నూతన పరికరాల గురించి అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. నిర్వాహక కార్యదర్శి డాక్టర్ విజయ భాస్కర రెడ్డి, చీఫ్ పాట్రన్ డాక్టర్ జగన్మోహన్, కర్నూలు జిల్లా నేత్ర వైద్యుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ నర్సిరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగ సురేష్, డాక్టర్ సంజీవ్ సభలో ప్రసంగిస్తూ యువ నేత్ర వైద్యుల కోసం నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు తరచూ నిర్వహించి వారికి ఆధునిక చికిత్స విధానాలపై కార్యశాలలు నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా ప్రజలకు ఆధునిక నేత్ర వైద్యాన్ని అందిస్తామన్నారు. సదస్సులో పాల్గొన్న ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ మదన్మోహన్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ విజయ, డాక్టర్ సింధూర మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా సదస్సులో ఉపన్యసించారు. నంద్యాల, కర్నూలు ,అనంతపురం తదితర జిల్లాల నుండి నేత్ర వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనశాల, రీడింగ్ రూముకు భూమి పూజ

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ఎండలో దుమ్ములో భోజనం చేస్తున్నారనివారిని విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామ మాజీ సర్పంచ్ మండడీ నారాయణరెడ్డి, నాగార్జున రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పాఠశాలలోని సమస్యలను వారు వివరించారు. నారాయణరెడ్డి వారి సమస్యలను విద్యార్థులకు ఇబ్బంది లేకుండా భోజనశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. క్రీస్తుశేషులు కృష్ణమూర్తి గారి కుమారుడైన రవీంద్ర బాబు దృష్టికి తీసుకెళ్లి సొంత గ్రామంలో పాఠశాల అభివృద్ధికి సహాయ పడాలని వారికి సమస్యను వివరించారు. డాక్టర్ రవీంద్ర బాబు స్పందించి విద్యార్థుల భోజనశాలక, రీడింగ్ రూమునిర్మించుటకు ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం డాక్టర్ రవీంద్ర బాబు, క్యాన్సర్ స్పెషలిస్ట్ కర్నూల్, డాక్టర్ సాయి వాణి నెఫ్రాలజిస్ట్ శాంతిరా మాస్టర్ నంద్యాల, డాక్టర్ అరుణమ్మ సాఫ్ట్వేర్ యూఎస్ఏ, జానకమ్మ, లు తరిగొప్పుల గ్రామం చేరుకొని భోజనశాలకు రీడింగ్ రూమ్ కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా సొంత గ్రామంలో మా తండ్రి కీర్తిశేషులు కృష్ణమూర్తి జ్ఞాపకార్థంతో నిర్మించినట్లు ఆయన అన్నారు. పాఠశాలలో నిర్మించడానికి విద్యార్థుల భవిష్యత్తు కోసం భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు భోజన శాల, రీడింగ్ రూము 60 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పుతో వీటిని నిర్మించినట్లు ఆయన తెలిపారు. వీటి నిర్మాణం అయ్యే ఖర్చు దాదాపు రూ.10 లక్షలతో అంచనా తో నిర్మించనున్నట్లు ఆయన అన్నారు. విద్యార్థులకు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ మండడి నారాయణరెడ్డి, నాగార్జున రెడ్డి, గ్రామ సర్పంచ్ అంజనమ్మ, లక్ష్మన్న ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు కృష్ణ కుమార్, శివన్న, విజయలక్ష్మి బాయ్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో సుంకు అచ్చమ్మ,అశ్వర్థము శెట్టిల జ్ఞాపకార్థం ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన సుమారు 20మంది వైద్యులు రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేసారు. అనంతరం సుంకు పార్థసారది, వసుంధరమ్మ చారిటీస్ వారి ఆధ్వర్యంలో అయ్యప్ప సేవాసమాజం అధ్యక్షుడు సుంకు జనార్ధన్ శెట్టి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వైద్య శిబిరానికి విచ్చేసిన వైద్యులను ఘనంగా సన్మానించారు.

డ్రైవర్ కుటుంబానికి చేయూత

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని బెలుం గ్రామంలో మారేం తిరుపతయ్య (45) అనే డ్రైవర్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. డ్రైవర్ మృతి సమాచారం తెలుసుకున్న సీనియర్ నాయకులు, పోతి రెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి అధ్యక్షులు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి గ్రామానికి చేరుకుని తిరుపతయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఒంటరి జీవితంతో తమ్ముని వద్ద ఉంటున్న తిరుపతయ్య అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. తిరుపతయ్య అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేలను అతని కుటుంబ సభ్యులకు వెంకటసుబ్బారెడ్డి అందించారు.

ఎమ్మెల్యేను కలిసిన పీపీ బత్తిన శివప్రసాదరావు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకమైన బత్తిన శివప్రసాద్ రావు ఆదివారం ఎమ్మెల్యే అఖిలప్రియ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా పీపీగా నియమితుడైన బత్తిన శివప్రసాద్ రావుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రమణయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా గణిత శాస్త్రవేత్త రామానుజన్‌కు నివాళ్లు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: గణిత శాస్త్రంలో గణిత విశ్లేషణ సంఖ్య శాస్త్రం పైన విశేషమైన కృషి చేశారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగ జిష్ణు విజయ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకులు అధ్యాపకులు ఎస్వీరాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ పరిపాలనా కాలంలో భారతదేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త రామానుజన్ ముఖ్యులు అన్నారు. శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబర్ 22న జన్మించారన్నారు. అప్పట్లో పరిష్కారం కావు అనుకున్న సమస్యలకు కూడా రామానుజన్ పరిష్కారం కనుగొన్నారన్నారు. 1729 అనేది రామానుజన్ సంఖ్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాసాగర్, రామకృష్ణారెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా మంచినీటి బోరు..

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని లింగదహళ్లి క్రాస్ వద్ద అధికారులు వేసిన మంచినీటి బోరు అపరిశుభ్రతగా ప్రజలు ఆదివారం తెలిపారు. మంచి నీటి బోరు చుట్టుపక్కల పిచ్చి గడ్డితోపాటు కంప చెట్లు విపరీతంగా పెరిగిన అధికారులు ఎవరు తొలగించలేకపోయారని ప్రజలు వాపోయారు. పిచ్చి గడ్డి, ముళ్ళకంప చెట్ల మధ్య విష పురుగులు చేరుకుంటాయని, వీటి వల్ల ప్రమాదం పొంచి ఉంటుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోజు దారిన పోయే వారు, ప్రయాణికులు చుట్టుపక్కల పొలం రైతులు నీటిని త్రాగుతున్నారు. అపరిశుభ్రంగా ఉండడం వల్ల మురికి నీరు మంచినీటి బోర్లు దూరతాయని అవినీతిని తాగితే వాంతులు, వీరేచనాలు అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మంచినీటి బోరు కోసం నిర్మించిన ప్లాట్‌ఫామ్ కనిపించకుండా పోయిందన్నారు. కాలు పెట్టాలన్న వీలు లేకుండా పిచ్చి గడ్డి పెరిగిందని అన్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి మంచినీటి బోరు చుట్టుపక్కల ఉన్న పిచ్చి గడ్డిని ముళ్ళకంపలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు : కేంద్ర మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు పరిగెల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యసభలో చర్చ జరిగేటప్పుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా మాటలు అర్థరహితమని, అంబేద్కర్ లేకపోతే మంత్రి పదవి దక్కేదా అని ప్రశ్నించారు. అమిత్ షా వెంటనే మంత్రి పదవికి, పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రాజ విహార్ సెంటర్ నందలి అంబేద్కర్ భవన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా బయలుదేరి అక్కడ కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చి కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి పంపవలెనని కోరుతామని తెలియజేశారు. అనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని నిర్మించిన ప్రపంచ మేధావి అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు మాట్లాడుతూ దేశంలో దేవుడి తరువాత అత్యధిక ప్రజలు ఆరాధించే వ్యక్తి బీఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని బాష, కాంగ్రెస్ నాయకులు కె.సత్యనారాయణ గుప్త, ఎస్.ప్రమీళ, అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు నివాళ్లర్పించిన నాయకులు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఎస్టీయూ ఎమ్మిగనూరు తాలూకా కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనందరి జీవితాలలో గణితం ఉంటుందని కానీ చాలా అరుదుగా కొందరి జీవితమే గణితంలో ఉంటుందని అలాంటి కోహినూర్ వజ్రమే శ్రీనివాస రామానుజన్ శ్రీనివాస రామానుజన్ గారికి సహజ సిద్ధంగా చిన్నతనము నుండి గణితం పట్ల ఆసక్తి కలిగి ఉండి గణితంలో అనేక సమస్యలు సాధిస్తూ గణిత శాస్త్రవేత్తగా ప్రసిద్ధి చెందాడని, అందరూ గాలిని శ్వాసిస్తే ఆయన గణితాన్ని శ్వాసించారు. ఆయన ఓ అసాధారణ గణిత దైవమని ఆయన జీవితాన్ని శోధిస్తే మనకు అర్థమవుతుంది అని తెలిపారు. ఉపాధ్యాయులు వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు గణితం పట్ల ఉన్న భయాన్ని, ఆందోళనలను తొలగిస్తూ అర్థమయ్యేలా ఆకట్టుకునే రీతిలో ఆటపాటల ద్వారా బోధించాలని, రామానుజన్ వంటి జీనియస్ ను తయారీ చేయడానికి కృషి చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, చంద్రశేఖర్, ప్రసన్నరాజు, లక్ష్మన్న, సరళ బసవరాజు, రంజాన్, యల్లప్ప, రాముడు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిద్దాం

విశాలాంధ - పాములపాడు: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు తమ వంతు కృషి చేద్దామని పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి చల్లా జయశంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏఎన్ఆర్ జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం అధ్యక్షుడు నాగేంద్ర చారి అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆ సంఘం కోశాధికారి అచ్యుతరావు విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు వరుసగా సంఘం తరఫున ఇవ్వనున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక పూర్వ విద్యార్థి సహకారం అందించాలని చెప్పారు. సంఘంలో సభ్యత్వం కోసం రూ.365 చెల్లించాలని కోరారు. నిబంధన ప్రకారం ఈ సంఘం కొనసాగుతుందని వివరించారు. ప్రభుత్వం అందించే పథకాలతో పాటు మన వంతుగా విద్యార్థుల కోసం ఉన్నత విద్యను అభ్యసించేందుకు సహకారం అందిద్దామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నీ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల్లో సుమారు పేద విద్యార్థులే ఉంటారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు తల్లిదండ్రులు కూడా దాదాపుగా వ్యవసాయ కూలీలే అధికంగా ఉంటారనీ కాబట్టి ప్రతి పూర్వ విద్యార్థి కూడా తమ వంతు బాధ్యతగా విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు ముందు అన్ని సబ్జెక్టుల పైన ఒక పరీక్ష నిర్వహించి, వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహిద్దామని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు ఈ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి సహకారం అందించాలని కోరారు. ఆ సంఘం సభ్యులు వెంకటేశ్వరరావు,దేవ భూషణం, ఇస్మాయిల్, పుల్లయ్య,శ్రీనివాసులు, మౌలా హుస్సేన్,సాయి కృష్ణ, నాగ శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

రబీ వరి మడులలో యాజమాన్య పద్ధతులు

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలోని బోయ రేవుల, వెలుగోడు గ్రామలలో వరి నారుమడులను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే వరి నారుమడులు పోసుకున్నారని,కొన్ని ప్రాంతాల్లో నేరుగా వెదజల్లే పద్ధతిలో వరిసాగుకు సిద్ధమవుతున్నారు. రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి, ఈ ప్రభావం వరినారుమడులపై పడే అవకాశం ఉందని, చల్లగాలులు మంచు నుండి నారును సంరక్షించుకుంటే ఆరోగ్యంగా పెరిగి సకాలంలో చేతికి అందుతుందని అన్నారు. ఇందుకు నారుమడి పోసేటప్పటి నుండి నారును ప్రధాన పొలంలో నాటే వరకు రైతులు తగిన మెళకువలు పాటించాలని ఏఓ రైతులను సూచిస్తున్నారు. ఒక ఎకరా నారుమడికి నత్రజని 2 కిలో భాస్వరం 2 కిలో పొటాష్ 1 కిలో పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్ 2 క్వింటాలు నత్రజని 1 కేజీ మ్యాంకోజెబ్ ం కార్బెండిజమ్ 2 గ్రా జింకు దాతు లోపం నివారణ కు,ఎకరా నారుమడికి జింక్ సల్ఫేట్ 500 గ్రా. వేసుకోవాలని ఏఓ పవన్ తెలిపారు.రబిలో చాలా చేసిన పంటలకు డిసెంబర్ 31 లోగా పంట బీమా ప్రీమియం చెల్లించి పంట బీమా సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరడమైనది. ఈ కార్యక్రమంలో ఏవోతో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి రామకృష్ణ రైతులు వీరభద్రుడు శ్రీరాములు పాల్గొన్నారు.

రామానుజన్ చిత్రపటానికి ఘన నివాళ్లు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రపంచ ప్రసిద్ధి చెందిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని రాయలసీమ విశ్వవిద్యాలయం గణిత శాఖ అధ్యక్షులు ఆచార్య సీవీ సుందర నందన్ కొనియాడారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీలోని వి సి కాన్ఫరెన్స్ అల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రామానుజన్ పూలమాలవేసి నివాళులర్పించారు. రామానుజన్ 137వ జయంతిని పరిష్కరించుకుని యూనివర్సిటీ నేషనల్ మ్యాథమెటిక్స్ డే నిర్వహించడం సంతోషకరమన్నారు. గణిత శాస్త్రానికి సంబంధించి విస్తృతం పరిశోధనలతో వివిధ ప్రతిపాదన చేసి రామానుజన్ స్మృతిలోభారత ప్రభుత్వం ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 జాతీయ గణిత దినోత్సవం గా నిర్వహిస్తుందని వివరించారు రామానుజన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు 20వ శతాబ్దపు గణిత మేధావులు ఆయనకు సుస్థిర స్థానాన్ని ఏర్పరిచారని ఆచార్య సుందరనంద్ వివరించారు. అలాంటి గొప్ప పరిశోధకుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రామానుజన్ లాంటి ఒక గొప్ప మేధావి భారతీయులు కావడం మనందరికీ గర్వకారణమని యూనివర్సిటీ టీచర్స్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథ్ రెడ్డి నిత్యజీవితంలో గణితం ఏ విధంగా ముడిపడిందో తెలుపుతూ స్ఫూర్తిదాయకమైన రామానుజన్ జీవిత విశేషాలను ఆయన వివరించారు. రామానుజన్ జీవించినది కేవలం 32 సంవత్సరాలు అయినప్పటికీ చిరకాలం నిలిచే పరిశోధకులు చేసి రామానుజన్ ఆర్యభట్ట లాంటి ప్రాచీన మేధావుల నరసన చేరదగిన మహనీయుడని యూనివర్సిటీ డి న్ ఆఫ్ అకాడమీ ఆఫర్స్ ఆచార్య ఆర్ భరత్ కుమార్ నివాళులర్పించారు .గాయత్రి, హర్షిత, జనార్ధన్, సాయి, తదితర విద్యార్థులు రామానుజన్ గణిత శాస్త్రాన్ని చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ గణిత విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం.వీర కృష్ణ, డాక్టర్ ఎస్.వి.సునీత, డాక్టర్ ఎం నాగిరెడ్డితో పాటు వివిధ విభాగాల ఆచార్యుల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణం పనులు

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని గజ్జెహళ్లిలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆంజనేయ స్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గజ్జే హళ్లి హనమంత రెడ్డి ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు జెసిబి యంత్రం ద్వారా ఆలయగోడలను కూల్చివేసి మట్టిని, రాళ్ళకుప్పలను ట్రాక్టర్ ద్వారా దూరంగా తరలించారు. 1959లో నిర్మించిన ఆలయాన్ని రెండోసారి శిలా కట్టడం నిర్మించడానికి ఆలయాన్ని కూల్చివేశారు. విరుపాపురం వడ్రంగిలకు గుడి నిర్మాణం పనులు అప్పజెప్పమని అన్నారు. ఆలయాన్నీ పూర్తిగా శిలా కట్టడం ద్వారా నిర్మించి స్టీల్ గేట్లు, వరండాలను నిర్మిస్తామని ఆలయ ధర్మకర్త గజ్జే హళ్లి హనుమంత రెడ్డి పేర్కొన్నారు

హొళగుందలో వర్షం.. వర్షం వల్ల ఇబ్బంది పడ్డ రైతన్నలు

విశాలాంధ్ర-హొళగుంద: హొళ గుందలో ఆదివారం వర్షం కురిసింది. కురిసిన వర్షం వల్ల వరి రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వరి పంటలు కోసి పొలాల్లో వరి గింజలను రైతులు ఆరబోశారు. వర్షం వల్ల వరి గింజలు తడిచిపోవడంతో ఆయకట్టు రైతులు ఆర్థికంగా నష్టపోయారు. మిరప పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు పొలాల్లోనే మిరపకాయలను ఆరబోసుకున్నారు. వర్షంతో మిరపకాయలు తడవడంతో తక్కువ ధరకు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తారని, తమకు అప్పులే మిగులుతాయని రైతులు వాపోతున్నారు. రైస్ మిల్లులో వేసిన వరి ధాన్యానికి రైతులు తార్పాల్ కప్పక పోవడంతో వరి ధాన్యం తడిసిపోయాయి. తుఫాన్ వల్ల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. వరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నందున వర్షం దెబ్బతో కోత పనులు ఆగిపోయాయి వర్షాలు ఇలాగే పడితే పంటల దిగుబడిరాక కనీస మద్దతు ధర లభించక అప్పులే మిగిలి పోతాయని రైతన్నలు ఆవేదన చెందారు. కురిసిన వర్షానికి రైతులు నానా అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ చిత్తడి, చిత్తడిగా మారాయి.

నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - తుగ్గలి: జిల్లాలోని అన్ని మండలాల కంటే తుగ్గలి మండలంలో టీడీపీ సభ్యత్వాన్ని చేయడంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎర్రగుడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కెఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఉండే ఓటర్లలో కనీసం 70 శాతం ఓటర్లు సభ్యత్వం తీసుకునే విధంగా చూడాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు అందిస్తున్న మంచి పరిపాలన గురించి ప్రజలకు వివరించాలన్నారు. గతంలో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు ఉండేవి కావని, ప్రస్తుతం గ్రామాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులను పుష్కలంగా విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, టీడీపీ నాయకులు మనోహర్ చౌదరి, గిరి గేట్ల తిమ్మయ్య చౌదరి, వెంకటస్వామి, వెంకటపతి, అమీనాబాద్ మధుబాబు, కృష్ణమూర్తి చౌదరి, జొన్నగిరి మిద్దె వెంకటేష్ యాదవ్, రాంపురం మల్లయ్య, గిరిగేట్ల బోలా మల్లికార్జున పాల్గొన్నారు.

11 గ్రామాలలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

విశాలాంధ్ర - కర్నూలు: జిల్లాలో సోమవారం 11 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని కోసిగి మండలంలోని దొడ్డి గ్రామం,మంత్రాలయం మండలంలోని దిబ్బన దొడ్డి గ్రామం,పెద్దకడబూరు మండలంలోని చిన్న తుంబలం గ్రామం, ఆదోని మండలంలోని బలదూర్ గ్రామం, ఎడవల్లి గ్రామం,కౌతాళం మండలంలోని కరణి గ్రామం. తిప్పలదొడ్డి గ్రామం, కర్నూలు రెవెన్యూ డివిజన్లోని ఓర్వకల్లు మండలంలోని హుస్సేనా పురము గ్రామం, గూడూరు మండలంలోని గూడూరు గ్రామం, పత్తికొండ రెవెన్యూ డివిజన్లోని దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామం, వెల్మకూరు గ్రామమాల్లో మొత్తం 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.